సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 31.07.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 269
పేజీలు: 08 వెల: రూ. 5


## 2034 వరకూ నేనే సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి



- ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం.. తెలంగాణ విద్యార్థులు గ్లోబల్ పోటీకి సిద్ధం కావాలి
- ప్రతి విద్యార్థిపై రూ.1.08 లక్షల ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- 2023 తర్వాత డ్రాపౌట్లు తగ్గాయి.. అడ్మిషన్లు పెరిగాయి
- పీవీ ప్రారంభించిన రెసిడెన్షియల్ విద్యా విధానమే ఆదర్శం..
- టీచర్ల సమస్యలు నా బాధ్యత..

02

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో మంత్రి పొంగులేటి టెలీకాన్ఫరెన్స్

- వాయుగుండం ప్రభావం నేపథ్యంలో సమీక్ష
- భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

03

## నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యం

జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



- రగుడు జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు
- ఐడీఓసీలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఆర్డీ పాస్ బుక్ ల పంపిణీ

03

# ప్రాజెక్టులకు జలకళ



## తెలంగాణలో భారీ వర్షాలు

### 5 జిల్లాలకు రెడ్ అలర్ట్

- ఎల్లంపల్లికి 75 వేల క్యూసెక్కుల వరద..
- మిడ్ మానేరుకు ఎత్తిపోత షురూ
- మేడిగడ్డ వద్ద 85 గేట్లు ఓపెన్..
- జూరాలకు పెరుగుతున్న వరద ప్రవాహం
- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు..
- పలు ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు

**ముద్ర నెట్ వర్క్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తెలంగాణను వర్షాలతో ముంచెత్తుతోంది. ఎడతెరిపిలేని భారీ నుంచి అతిభారీ వర్షాలతో కృష్ణా, గోదావరి బేసిన్లలో వరద ఉధృతి పెరిగి ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. మేడిగడ్డలో 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, ఎల్లంపల్లి, కడెం, తాలిపేరు, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు భారీగా వరద చేరుతోంది. మరోవైపు వాగులు, వంకలు ఉప్పొంగడంతో పలు జిల్లాల్లో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రైతుల్లో ఆశలు చిగురిస్తుండగా, వరదలప్పుడు జాగ్రత్తగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



తీవ్ర వాయుగుండం నేపథ్యంలో నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తోపాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది. మిగతా 02లో

# వర్ష బీభత్సం

## తెగిపోయిన కల్వర్టులు.. స్తంభించిన జనజీవనం

### వికారాబాద్-పరిగి రాకపోకలకు బ్రేక్..



- ఆదిలాబాద్‌లో మహారాష్ట్రతో తెగిన రవాణా బంధం
- మదిగుల్చెట్టెంపల్లి వద్ద వరద ఉధృతికి కల్వర్టు ధ్వంసం
- కడెం ప్రాజెక్టు 13 గేట్లు ఎత్తివేత.. గోదావరికి భారీగా నీటి విడుదల
- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం.. ఓపెన్‌కాస్ట్ లోకి వరద
- పలు జిల్లాల్లో రోడ్లు దెబ్బ.. స్కూళ్లకు సెలవులు
- చెరువులు, వాగులు నిండడంతో రైతుల్లో ఆనందం

**ముద్ర న్యూస్ నెట్‌వర్క్ :** తెలంగాణను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రహదారులు దెబ్బతినడంతో రాకపోకలు స్తంభించగా, పలు ప్రాంతాల్లో కల్వర్టులు, అప్రోచ్ వంతెనలు కొట్టుకుపోయాయి. మరోవైపు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవడంతో రైతుల్లో మాత్రం కొత్త ఆశలు చిగురించాయి.

వికారాబాద్ జిల్లాలో బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి వికారాబాద్–పరిగి ప్రధాన రహదారిపై మదిగుల్చెట్టెంపల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు వరద ఉధృతికి ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాల్లోనే ప్రయాణించాలని అధికారులు సూచించారు.

ఎగువ మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావం ఆదిలాబాద్ జిల్లాపై తీవ్రంగా పడింది. తర్ణం అప్రోచ్ వంతెన కొట్టుకుపోవడంతో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. కడెం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో అధికారులు 13 గేట్లను ఎత్తివేసి దిగువ గోదావరికి నీటిని విడుదల చేస్తున్నారు. నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో రహదారులు దెబ్బతినడంతోపాటు పలు ఇళ్లు కూలిపోగా, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో మూలవాగు ఉప్పొంగడంతో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. మామిడిపల్లి–నిజామాబాద్ మధ్య రహదారి కొంత భాగం వరద నీటికి కొట్టుకుపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మిగతా 02లో

## నిధుల పక్కదారి

కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి లేఖ



- కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారు
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని డిమాండ్

03

## రూ. 6వేల కోట్ల బకాయిల చెల్లింపులు

100 రోజుల్లో చెల్లిస్తామని ఉద్యోగులకు ప్రభుత్వం హామీ




**ముద్ర, హైదరాబాద్ :** ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిలను విడుదల చేస్తామన్న మాటను తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతూ తమ చిత్తశుద్ధిని మరోసారి చాటుకుంది. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల స్పష్టమైన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య మిగతా 02లో

## ఆ లేఖ ఫేక్

02

మోదీ రాజీనామా వైరల్ పై పీఐబీ క్లారిటీ

- పీఐబీ బిగ్ స్టేట్‌మెంట్
- ఫేక్ పోస్టులు నమ్మొద్దని హెచ్చరిక
- అధికారిక సమాచారం మాత్రమే నమ్మండి
- ఏఐ ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తంగా ఉండండి




## బెదిరిస్తున్నారు



- కుటుంబానికి హాని చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు..
- 16 రోజులు ఇల్లు విడిచి వెళ్లామని అభిజిత్ తల్లిదండ్రుల వెల్లడి
- నీట్ పోరాటం తర్వాత దీప్కకు బెదిరింపులు వచ్చాయని ఆరోపణ

02

## ప్రాణాల రక్షణే లక్ష్యం

ఎంపీ ఈటల రాజేందర్

- ఓవర్ బ్రిడ్జులు, అండర్ పాస్‌లు మంజూరు చేయండి

03



## సాయం చేస్తే సంతృప్తి



ఎన్టీఆర్ ట్రస్ట్‌తో 29 ఏళ్లుగా సేవ

- కుప్పం ప్రజల ప్రేమాభిమానాలే మా కుటుంబానికి బలం
- నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న భువనేశ్వరి

03

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in | @mudranews



### తెల్లబడిన జుట్టు మళ్లీ నల్లగా మారదు



నిపుణుల ప్రకారం ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న చాలా యాంటీ-గ్రే హెయిర్ సీరమ్‌లు ఇప్పటికే తెల్లబడిన వెంట్రుకలను శాశ్వతంగా నల్లగా మార్చలేవు.వీటి ప్రభావం ఎక్కువగా జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికే పరిమితమవుతుంది.




## రూ. 6వేల కోట్ల చెల్లింపులు

**(మొదటి పేజీ తరువాయి)**

కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం మరో రూ. 2 వేల కోట్ల నిధులను విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం మొత్తం రూ. 6 వేల కోట్ల బకాయిలను చెల్లించింది. మూడు విడతల్లో రూ. 6,000 కోట్లు.. గత మే 29న మొదటి విడత గా రూ. 2,000 కోట్లు, జూన్ 30న రెండో విడతగా రూ. 2,000 కోట్లు, మూడో విడత మరో రూ. 2,000 కోట్లు (గురువారం) విడుదల చేశారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం ఈ నిధులతో పూర్తిగా చెల్లించింది. రాబోయే రోజుల్లో మిగిలిన ఇతర బకాయిలను కూడా ఇదే రీతిలో క్రమ పద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల నిధులు విడుదల చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ప్రతికూల పరిస్థితుల్లోనూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న సానుకూల ధోరణి అభినందనీయమని ఉద్యోగ జేఏసీ నేతలు కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బీజేపీలో చేరాలంటు బెదిరింపులు

**ముద్ర ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపే సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ జనతా పార్టీలో చేరాలంటూ కొందరు తనకు వరుసగా బెదిరింపు ఫోన్ కాల్స్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ పార్టీలో చేరకపోతే తన కుటుంబాన్ని అంతమొందిస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు నేరుగా ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఈ తరహా ఒత్తిళ్లకు, బెదిరింపులకు తాను ఎంత మాత్రమూ భయపడేది లేదని ఆయన తెగేసి చెప్పారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా, ఏ క్షణంలోనూ తాను బీజేపీలో చేరే ప్రసక్తి లేదని తన స్పష్టమైన వైఖరిని ఖరాకండిగా ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు.

**వేధింపులు ఆపాలి..**

ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు.

**ప్రభుత్వాన్నే మార్చేస్తాం..**

ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈ సారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పెల్లెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



**వేడుక చేస్తే తప్పా..**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు.

**కంగనా పార్ట్‌టైమ్ పొలిటీషియన్..**

పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.

## ప్రాజెక్టులకు జలకళ

**(మొదటి పేజీ తరువాయి)**

ఇంజనీరింగ్, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం.. హైదరాబాద్ తో పాటు మరో 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, జనగామ, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.





## 2034 వరకూ నేనే సీఎం

**ముద్ర, హైదరాబాద్:** విద్యావ్యవస్థ రాష్ట్రంలో బలపడిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావ్యవస్థ ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఎంసీహెచ్ఆర్డీ లో ఫిన్‌లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ చేంజ్' కార్యక్రమంలో భాగంగా ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఉపాధ్యాయుల బృందం పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారు..**

జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు వేసిన పునాదులతో ఇప్పుడు మన దేశంలో లైఫ్‌స్పాన్ పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇక్కడి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని చెప్పారు. విద్యలో నాణ్యత పెరగాలని, పిల్లలకు పౌష్టికాహారం అందాలని సూచించారు. తెలంగాణలో తనకు తెలిసిన మేధావులు ఇద్దరేనని.. వారిలో కేకే, జైపాల్‌రెడ్డి అని అభివర్ణించారు. విద్య విషయంలో బాధ్యత తీసుకోవాలని కేకేను అడిగానని చెప్పుకొచ్చారు. ఆయన సలహాదారుగా అనేక సూచనలు చేస్తున్నారని తెలిపారు. వెనకబాటుతనానికి కారణం చదువులేకపోవడమేనని చెప్పుకొచ్చారు. చదువుకున్న ఎస్సీలు సమాజంలో మంచి స్థానంలో ఉన్నారని వివరించారు. ఆస్తులున్నా.. చదువు లేకపోతే సమాజంలో వెనకపడిపోతున్నారని వెల్లడించారు. విద్యార్థులను సమాజంలో గొప్పగా నిలబెట్టగలిగిన శక్తి ఉపాధ్యాయులకు ఉందని కొనియాడారు. ప్రతీ విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు తాము చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

**ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదు..**

పీవీ నర్సింహారావు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వేల్‌లో ఆ స్కూల్లోనే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చదువుకున్నారని ప్రస్తావించారు. నవోదయకు స్ఫూర్తి సర్వేల్ గురుకులమని చెప్పుకొచ్చారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదని అభిప్రాయపడ్డారు. ప్రపంచం ఇంకా మెరుగైన నాణ్యమైన విద్య ఆశిస్తుందని తెలిపారు. నేర్చుకోవడమే కాదని.. నేర్చుకున్న వాళ్లతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని అన్నారు. జర్మన్, జపాన్, సౌత్ కొరియా, చైనా లాంటి దేశలతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. బదిలీలు, ప్రమోషన్లు అన్నీ అడగకుండానే తాము ఇచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యలు తనకు వదిలేయాలని అన్నారు. వారి సమస్యలను తాను పరిష్కరిస్తానని మాటిచ్చారు. 2023 వరకు ఒకటో తేదీనే జీతాలు పడ్డాయా? అని ప్రశ్నించారు. ఈ మూడేళ్లు తెలంగాణను సక్రమంగానే నడిపించానని స్పష్టం చేశారు. ఎక్కడా ఆగం కాలేదని.. కలగాపులగం చేయలేదని తెలిపారు. ప్రతి విద్యార్థిపై రూ. 1,08,000 ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. 2014–23 మధ్య డ్రాపౌట్స్ పెరిగాయని వివరించారు. 2023–26 వరకు డ్రాపౌట్స్ తగ్గి అడ్మిషన్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. విద్యాశాఖలో తాము తెచ్చిన సంస్కరణలే ఇందుకు కారణమని వెల్లడించారు. క్రమశిక్షణ లేకపోతే ఎంత తెలివి ఉన్నా పనికిరారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## వర్ష బీభత్సం

**(మొదటి పేజీ తరువాయి)**

భారీ వర్షాల ప్రభావం సింగరేణి బొగ్గు ఉత్పత్తిపైనా పడింది. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరడంతో ఓబీ తొలగింపు పనులు నిలిచిపోయాయి. భారీ యంత్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, పరిస్థితిని సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అయితే ఈ వర్షాలు రైతులకు వరంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు, వాగులు నిండిపోవడంతో సాగునీటి లభ్యత మెరుగుపడనుంది. ఖరీఫ్ పంటలకు ఈ వర్షాలు ఎంతో మేలు చేస్తాయని, భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు ఒకవైపు ప్రజలకు ఇబ్బందులు కలిగించినప్పటికీ, మరోవైపు వ్యవసాయానికి ఊరటనిచ్చాయి.



## రక్షణ,యుద్ధ పరిస్థితులపై మోడీ ఫోకస్



**ముద్ర, ఢిల్లీ:** ప్రధాని మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశమైంది. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాకస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న అంతర్జాతీయ సంఘర్షణలు, వాటి వల్ల కలిగే భద్రతాపరమైన పరిణామాలు, దేశ ఎగుమతులు, దిగుమతుల్లో ఏర్పడే అంతరాయాలు, విదేశాల్లోని భారతీయ పౌరుల భద్రత, నావికుల రక్షణ గురించి ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

భారత్‌కు చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో భారత్‌కు సరకు రవాణాలో ఇబ్బందులు ఎదురవ్వకుండా తీసుకుంటున్న చర్యలపై ప్రధాని ఆరా తీసినట్లు సమాచారం. నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్ మార్గాలను ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవడంపైనా చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పెట్రోలియం, సహజవాయువు, ఎరువులు తదితరాల దిగుమతికి తీసుకుంటున్న చర్యలపై ఆయా శాఖలు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ భేటీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పాల్గొన్నారు.

## ఆ లేఖ ఫేక్

**ముద్ర, ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా సూచించింది పీఐబీ. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ(AI) ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

**ముద్ర, హైదరాబాద్ :**
రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో సీఎంతో ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.

గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90 శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపింది.

పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగు నీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in | @mudranews



### తెల్ల జుట్టు : మెలనిన్ ఉత్పత్తిపై పరిమిత ప్రభావమే

కొన్ని సీరమ్‌లు మెలనిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయని కంపెనీలు చెబుతున్నా, దీనికి బలమైన శాస్త్రీయ ఆధారాలు చాలా తక్కువగా ఉన్నాయి.అందువల్ల ప్రకటనలను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి.



# నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

- జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రగుడు జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు
- ఐడీఓసీలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఆర్డీ పాస్ బుక్ ల పంపిణీ




**ముద్ర, రాజన్న సిరిసిల్ల** : సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు.

అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

**నాణ్యమైన చీరల ఉత్పత్తి..**

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల మోడల్ చీర మహిళలకు అందుబాటు ధరలో ఒకటి తయారు చేసి.. జీ ఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024–25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలలపాటు ఉపాధి కల్పించామని తెలిపారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని వెల్లడించారు.

నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడ లో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

**మహిళలు పండగలు, కార్యక్రమాలకు కట్టుకుంటున్నారు.. : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ కు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ, రోడ్డు భద్రత చర్యలు తీసుకున్నామని, వస్త్రం తయారీలో వివిధ దశలను తెలుసుకునేలా విగ్రహాలను ఏర్పాటు అయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కూడా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప పాల్గొన్నారు.

## దేశంలో 4 వేల ఈ-బస్సులు ప్రవేశపెట్టిన ఒలెక్ట్రా

**దేశంలో ఈ ఘనత సాధించిన తొలి సంస్థ ఒలెక్ట్రా**

**297 బస్సులు హిమాచల్ ఆర్టీసీకి అందజేత**




**ముద్ర, హైదరాబాద్ :** దేశంలో 4 వేల ఎలక్ట్రిక్ బస్సులను రోడ్లపై ప్రవేశపెట్టిన తొలి సంస్థగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా 4,000వ ఈ–బస్సును హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వానికి అందజేయడంతో పాటు హెచ్‌ఆర్‌టీసీకి 297 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించింది. ఇప్పటివరకు ఒలెక్ట్రా ఈ–బస్సులు 73 కోట్ల గ్రీన్ కిలోమీటర్లు ప్రయాణించి, 6.5 లక్షల టన్నులకు పైగా కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు దోహదపడ్డాయని సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ–బస్సులు సుస్థిర ప్రజా రవాణా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఒలెక్ట్రా ఎండీ మహేష్ బాబు పేర్కొన్నారు.

## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రులు

**ముద్ర న్యూస్, సిరిసిల్ల:** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ భీమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు వరుణ యాగం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వేములవాడకు చేరుకున్న మంత్రులకు భీమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట కలెక్టర్ గరిమ అగర్వల్, ఎస్పీ మహేష్.బి. గితే తదితరులు ఉన్నారు.

## ఓవర్ బ్రిడ్జ్ లు, అండర్ పాస్ లు మంజూరు చేయండి

**రైల్వే భద్రతపై అశ్విని వైష్ణవ్‌తో ఈటల రాజేందర్ భేటీ..**



**ముద్ర ఢిల్లీ :** కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ను బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలంగాణలోని రైల్వే మౌలిక సదుపాయాలు, రైల్వే భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో రైల్వే ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జుల అవసరం ఉందని పేర్కొన్న ఈటల, ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. అలాగే సిద్ధంగా ఉన్న కొత్త ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ నగరంలో రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ పెరగడంతో ప్రజలు పట్టాలు దాటే సమయంలో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ప్రతి చోట ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు వెళ్లేలా చిన్న అండర్ పాస్‌లను నిర్మించాలని సూచించారు. పట్టాలు తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జులు ఏర్పాటు చేయాలని కూడా కోరారు.

అలాగే దేశవ్యాప్తంగా అనేక చోట్ల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జులు వర్షాకాలంలో నీటితో నిండిపోవడం వల్ల ప్రజలకు ఉపయోగపడడం లేదని పేర్కొంటూ, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైల్వే మంత్రిని కోరారు. ప్రజల ప్రాణాలను కాపాడటం, రైలు ప్రమాదాలను నివారించడమే అందరి లక్ష్యంగా ఉండాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## ఆపదలో ఉన్నవారికి సాయం చేయడంలోనే సంతృప్తి

- ఎన్టీఆర్ ట్రస్ట్‌తో 29 ఏళ్లుగా ప్రజాసేవ
- కుప్పం ప్రజల ప్రేమాభిమానాలే మా కుటుంబానికి బలం
- నారా భువనేశ్వరి
- నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న భువనేశ్వరి



**ముద్ర, కుప్పం :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌లో 29 ఏళ్లుగా తన ప్రయాణం ప్రజాసేవకే అంకితమైందని, కుప్పం ప్రజలు తమ కుటుంబంపై చూపిస్తున్న ప్రేమాభిమానాలే తమకు కొండంత బలమని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు కుట్టు మిషన్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి హియరింగ్ ఎయిడ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలు భయపడకుండా ధైర్యంగా ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరని సూచించారు. కుటుంబ సంతోషం మహిళల చేతుల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రోత్సాహంతో తాను వ్యాపార రంగంలోకి అడుగుపెట్టానని గుర్తు చేశారు.

మహిళల ఆర్థిక సాధికారత కోసం కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, అక్కడ శిక్షణ పొందిన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో 'స్త్రీ శక్తి హస్తకళా స్టోర్' ప్రారంభించామని తెలిపారు. ఆ స్టోర్ ద్వారా వచ్చే లాభాలను తిరిగి మహిళలకే అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే సమష్టి కృషి, టీం వర్క్ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ట్రస్ట్‌కు సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చల్లపల్లిలోని ఎన్టీఆర్ స్కూల్ ద్వారా అనాథ పిల్లలకు విద్య అందించడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు.

పర్యటనలో భాగంగా కుప్పంలోని శ్రీ సాయిబాబా ఆలయం, ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భువనేశ్వరి, ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం, అవసరమైన వారికి చేయూత అందించడమే తమ కుటుంబం ఎప్పటి నుంచో పాటిస్తున్న సేవా స్ఫూర్తి అని భువనేశ్వరి పేర్కొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వాయుగుండం ప్రభావం నేపథ్యంలో సమీక్ష
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ముద్ర, హైదరాబాద్** : ఛత్తీస్‌గఢ్‌పై ఉన్న తీవ్ర వాయుగుండం, చురుకైన నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వాగులు, వంకలు, చెరువుల వద్ద భద్రతా చర్యలు చేపట్టి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్, విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా, ట్రాఫిక్ పోలీసులతో కలిసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జూలై 30–31 తేదీల్లో భారీ వర్షాల అవకాశంతో ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

## పంచాయతీ నిధుల పక్కదారి

- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న కేంద్రమంత్రి బండి సంజయ్
- కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు.సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. "గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య పరిష్కారానికి,హెల్త్ కార్డుల సాధనకు కృషి

**టీయూడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి.**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిషాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటిలో జర్నలిస్టులకు కేటాయిస్తున్న ఇండ్ల స్థలాలలో మొదటి ప్రాధాన్యత రంగారెడ్డి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు అవకాశాలు కల్పించాలని టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి కోరారు. గురువారం బాలాపూర్ మండలం బడంగ్ పేట్ కేంద్రంలో జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టియుడబ్ల్యూజె (ఐజేయు) బాలాపూర్ మండలం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సిటిలో హైద్రాబాద్ ప్రాంత జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నందున, అదే ప్రాంతంలో ఉన్న రంగారెడ్డి జిల్లాలోని గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్న అర్హులైనవారందరికి కుడా ఇండ్ల స్థలాలను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కార్పొరేట్ అసుపత్రుల్లో పనిచేసే విధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో సహ టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ కృషి చేస్తున్నారని దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు, జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూజె రాజీలేని పోరాటం చేస్తుందని టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షకార్యదర్శులు సలీంపాషా, మేకల సత్యనారాయణలు అన్నారు.జిల్లాలోని అన్నీ మండల, నియోజకవర్గ కమిటీలు వేసి నంబర్ వన్ యూనియన్ గా టీ యూ డబ్ల్యూ జే నిలుస్తుందన్నారు.అన్నీ ప్రధాన పత్రికలు, చానళ్ళ రిపోర్టర్లతో పాటు సీనియర్ జర్నలిస్ట్ లు ఉన్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే మాత్రమే అన్నారు.జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలపై

అనంతరం బాలాపూర్ మండలం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే బాలాపూర్ మండలం నూతన కమిటీ కార్యవర్గం అధ్యక్షుడు కె.మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.జయంత్, కోశాధికారి సి.శ్రావణ్ కుమార్ , ప్రధాన సలహాదారులు అనంతుల శ్రీనివాస్, సలహాదారులు ఎం. భుజంగారెడ్డి, ఎండి.నిజాముద్దీన్, భూపాల్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ గౌడ్, ఏం.అమరేశ్వర్ రెడ్డి, ఆర్.రమేష్, సంయుక్త కార్యదర్శులు జి.శ్రీనివాస్, బొల్లంపల్లి రాంబాబు, కే.శ్రావణ్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, జిల్లాకార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మాజీ జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్,జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాండు యాదవ్,ఎలాక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు నర్సింహా, సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, బొల్లంపల్లి ఆంజనేయులు, సూర్యనారాయణ, ఈసీ సభ్యులు సురేందర్, జంగయ్య, శేఖర్, కృష్ణ, రాజ్ కుమార్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే బాలాపూర్ మండల కమిటీకి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in
@mudranews
mudratv



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



## భావోద్వేగాల
# కలయిక

ప్రేమ, పరస్పర నమ్మకం, త్యాగం, అర్థం చేసుకోవడం.. ఈ 4 విలువల మీదే దాంపత్య జీవితం నిలబడుతుంది. అలాంటి భార్యాభర్తల బంధాన్ని మరింత గుర్తు చేసుకునే రోజు 'దంపతుల దినోత్సవం'గా మే 29ను చాలామంది జరుపుకుంటారు. ఈ రోజు ప్రత్యేకంగా భార్యాభర్తల మధ్య ప్రేమను, అనుబంధాన్ని, కలిసి నడిచే జీవిత ప్రయాణాన్ని గుర్తు చేస్తుంది.

చాలామంది దాంపత్య జీవితం అంటే కేవలం ఒక కుటుంబ బాధ్యతగా భావిస్తారు. కానీ నిజానికి అది ఇద్దరు వ్యక్తుల భావోద్వేగాల కలయిక. జీవితంలో సుఖదుఃఖాలను పంచుకోవడం. ఒకరికి ఒకరు అండగా నిలవడం. కలిసి ఎదగడం దాంపత్య బంధానికి అసలైన అర్థం. అందుకే దంపతుల దినోత్సవం కేవలం ఒక సెలబ్రేషన్ కాదు.. ఒకరికొకరు ఎంత ముఖ్యమో గుర్తు చేసుకునే సందర్భం.

ప్రతిరోజూ కలిసి టీ తాగడం, పని అయిపోయాక మాట్లాడుకోవడం, ఒకరి ఆరోగ్యం గురించి మరొకరు పట్టించుకోవడం.. ఇవన్నీ చిన్న విషయాల్లా కనిపించినా దాంపత్య జీవితంలో ఎంతో విలువైనవి. ఈ రోజు అలాంటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భార్యాభర్తలు తమ అనుబంధాన్ని మరింత బలపరుచుకుంటారు.

ఈ రోజుల్లో ఉద్యోగ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, సమయం లేకపోవడం వంటి కారణాలతో చాలామంది దంపతుల మధ్య దూరం పెరుగుతోంది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా కారణంగా కూడా వ్యక్తిగత సంభాషణలు తగ్గుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దంపతుల దినోత్సవం వంటి రోజులు ఒకరికొకరు సమయం కేటాయించుకోవాలని గుర్తు చేస్తాయి.

దంపతుల దినోత్సవం సందర్భంగా ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే, ఒకరోజు పూర్తి సమయం కలిసి గడపడం ఎంతో విలువైనదిగా భావిస్తున్నారు చాలామంది. కలిసి భోజనం చేయడం, పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకోవడం, ఒక చిన్న ట్రిప్‌కు వెళ్లడం లేదా ఒక మంచి మాట చెప్పడం కూడా సంబంధాన్ని మరింత దగ్గర చేస్తాయి. భారతీయ సంప్రదాయంలో భార్యాభర్తల బంధానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. 'అర్ధాంగి', 'సహధర్మచారిణి' వంటి పదాలు భార్యకు ఇచ్చిన గౌరవాన్ని తెలియజేస్తాయి. అలాగే కుటుంబ వ్యవస్థ బలంగా నిలబడటంలో దంపతుల పరస్పర అవగాహన కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే దాంపత్యాన్ని ఒక పవిత్ర బంధంగా భావిస్తారు.

అయితే 'దంపతుల దినోత్సవం' (Couples Day) అనే ప్రత్యేక దినానికి సంబంధించిన స్పష్టమైన అధికారిక చరిత్ర మాత్రం లేదు. ఇది ఏదైనా ఒక దేశ ప్రభుత్వం లేదా అంతర్జాతీయ సంస్థ అధికారికంగా ప్రకటించిన రోజు కాదు. కాలక్రమేణా సోషల్ మీడియా, గ్రీటింగ్ కల్చర్, ప్రేమ సంబంధాలను సెలబ్రేట్ చేసే ఆధునిక ట్రెండ్‌ల ద్వారా ఈ రోజు ప్రాచుర్యం పొందింది. అయితే ఈ రోజు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం ప్రేమను వ్యక్తపరచడం మాత్రమే కాదు, సంబంధాల్లో నమ్మకం, గౌరవం, పరస్పర అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో గుర్తు చేయడం. ఒక చిన్న శుభాకాంక్ష, ఒక మంచి మాట, కొద్దిసేపు కలిసి గడపడం కూడా బంధాన్ని మరింత బలపరుస్తుందని ఈ రోజు గుర్తుచేస్తోంది.

# ఏఐ విప్లవం
## భారత్‌లో 8-12% ఉద్యోగాలపై ప్రభావం

ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేగంగా పుంజుకుంటున్న నేపథ్యంలో ఉద్యోగాల భవిష్యత్తు పై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జనరేటివ్ ఏఐ విస్తరణతో 'మా ఉద్యోగాలు ఊడిపోతాయా?' అనే భయం సగటు ఉద్యోగిని వెంటాడుతోంది. ఈ సమయంలో ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ విడుదల చేసిన తాజా నివేదిక పలు ఆసక్తికరమైన, ఉపశమనం కలిగించే అంశాలను వెల్లడించింది.

### 8-12% ఉద్యోగాలకు మాత్రమే ముప్పు

గోల్డ్‌మన్ సాచ్స్ నివేదిక ప్రకారం.. భారతదేశంలోని వ్యవసాయేతర ఉద్యోగాల్లో సుమారు 8% నుండి 12% వరకు జెన్ ఏఐ ప్రభావంతో రీప్లేస్ అయ్యే అవకాశం ఉంది. అయితే ఏఐ రాకతో ఉద్యోగాలన్నీ మాయమైపోతాయనే ప్రచారంలో నిజం లేదని సంస్థ స్పష్టం చేసింది. దీనిని ఒక పెద్ద ఉద్యోగ సంక్షోభంగా చూడాల్సిన అవసరం లేదని, ఊహిస్తున్నంత స్థాయిలో నష్టం జరగదని పేర్కొంది.

### 42-48% మందికి పెరగనున్న ఉత్పాదకత

ఏఐ వల్ల ఉద్యోగాలు పోవడమే కాదు.. అంతకంటే ఎక్కువ ప్రయోజనం కూడా ఉంది. దాదాపు 42% నుండి 48% మంది ఉద్యోగులకు ఏఐ ఒక అద్భుతమైన సహాయక సాధనంగా మారనుంది. ముఖ్యంగా కింది రంగాల్లో ఏఐ వల్ల పనిభారం తగ్గి, ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుంది. హెల్త్‌కేర్ & మెడికల్ సేవలు.. విద్య, బోధన, మీడియా & కంటెంట్ క్రియేషన్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ & ప్రొఫెషనల్ సర్వీసెస్, రిపోర్టుల తయారీ, డాక్యుమెంటేషన్, డేటా విశ్లేషణ వంటి రొటీన్ పనులను ఏఐ సెకన్లలో పూర్తి చేయడం వల్ల ఉద్యోగులు మరింత సృజనాత్మకమైన, విలువైన పనులపై దృష్టి పెట్టవచ్చు.

### ఏ రంగాలకు ఎక్కువ ప్రమాదం?

రొటీన్, పునరావృత పనులు ఎక్కువగా ఉండే విభాగాలపై ఏఐ ప్రభావం ఎక్కువగా ఉంటుందని నివేదిక హెచ్చరించింది. దీనివల్ల ప్రభావితమయ్యే ప్రధాన రంగాలు టెలికాం, కస్టమర్ కేర్ & కాల్ సెంటర్లు, డేటా ఎంట్రీ, బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్స్.. ఈ విభాగాల్లో ఆటోమేషన్ వేగంగా పెరుగుతుండటంతో కొన్ని రకాల ఉద్యోగాల అవసరం తగ్గే అవకాశముంది.

### అప్‌స్కిల్లింగే ఏకైక మార్గం

ఏఐ ని ఒక ప్రత్యర్థిగా కాకుండా మన పనిని సులభతరం చేసే భాగస్వామిగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి కింది నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యవసరం. రోజువారీ పనిలో ఏఐ సాధనాలను ఉపయోగించడం నేర్చుకోవాలి. ప్రాంప్ట్ ఇంజినీరింగ్ తో ఏఐ నుండి సరైన అవుట్‌పుట్ పొందడానికి సరైన ప్రశ్నలు/సూచనలు ఇవ్వాలి. డేటా అనలిటిక్స్ & డిజిటల్ స్కిల్స్ తో డేటాను విశ్లేషించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి.



## అల్లూరి
### ఆకాశంలో ఎగిరే చేపలా కొత్త రికార్డు!
# విమానాశ్రయం..

చుట్టూ దట్టమైన కొండలు.. ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణం.. ఇటువంటి ప్రాంతంలో కనుచూపమేర విమానాశ్రయం.. ఆ దృశ్యాలను చూస్తుంటేనే మనోరంజకం.. పైగా ప్రతి నిర్మాణంలో కొత్తదనం.. ఆధునికత.. అందువల్లే భోగాపురం విమానాశ్రయం కొత్తగా కనిపిస్తోంది. దీనికి సంబంధించిన విశేషాలను పరిశీలిస్తే..

భోగాపురం విమానాశ్రయం కోస్తా ఆంధ్ర తీరానికి దగ్గరగా ఉంటుంది.. అందువల్లే ఈ విమానాశ్రయాన్ని ఎగిరే చేప మాదిరిగా నిర్మించారు. దీనికి ఫ్లయింగ్ ఫిష్ అని పేరు కూడా పెట్టారు. విమానాశ్రయాన్ని అత్యంత ఆధునికత కట్టిపడేసే విధంగా నిర్మించారు. సీలింగ్ డిజైన్‌ను సంక్రాంతి ముగ్గుల మాదిరిగా నిర్మించారు. టెర్మినల్ గోడల మీద ఆంధ్రప్రదేశ్ చరిత్ర ఉట్టిపడే విధంగా కలంకారి చిత్రాలను నిర్మించారు. బొబ్బిలి వీణలు.. తోలుబొమ్మలు.. నృత్య భంగిమలు. శ్రీశైలం.. తిరుమల.. లేపాక్షి నంది.. మన్యం అడవులు.. కొండపల్లి బొమ్మలు.. ఏటికొప్పాక చిత్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని చిత్రాలు డిజిటల్ స్క్రీన్ మీద కూడా కనిపిస్తుంటాయి.

భోగాపురం అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ నిర్మించింది. ఈ సంస్థకు ఢిల్లీ.. హైదరాబాద్ విమానాశ్రయాలను నిర్మించిన చరిత్ర ఉంది. సంస్కృతి మాత్రమే కాకుండా.. సాంకేతికత విషయంలో కూడా జీఎంఆర్ చొరవ తీసుకుంది. ఇవి మన ఆశ్రయంలో లగేజీ అప్పగించడానికి ఏకంగా 40 చెకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. 18 ఎకరాలలో టెర్మినల్ భవనం నిర్మించారు. ఇందులో అనేక రకాల వసతులు కల్పించారు. విదేశాలకు వెళ్లే వారికి అత్యాధునికమైన లాంజ్ లు ఏర్పాటు చేశారు.

విమానాశ్రయంలో అత్యాధునిక ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్.. కేటగిరి 1 ఇన్స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టం.. మోడ్రన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం ను ఏర్పాటు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే సీసీ టీవీలు, పెరి మీటర్ ఇంట్రోజన్ డిటెక్టర్ సిస్టం.. బాంబులను గుర్తించే పరికరాలు ఏర్పాటు చేశారు.. ఇక అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా రక్షణ వ్యవస్థలను నిర్మించారు. బోయింగ్ 777, ఎయిర్ బస్ ఏ 350 అత్యంత భారీ కార్గో.. ప్యాసింజర్ విమానాలు కూడా ఇక్కడ ల్యాండ్ అయ్యే విధంగా సౌకర్యాలు కల్పించారు.

భోగాపురం విమానాశ్రయం వైజాగ్ నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్.. ఢిల్లీ.. బెంగళూరు వంటి నగరాలు కూడా ఈ విమానాశ్రయానికి చాలా దూరంగా ఉంటాయి. అయితే ప్రయాణికుల సౌకర్యం కోసం విశాఖపట్నం నుంచి ప్రతి అర్ధగంటకు ఒక బస్సును విమానాశ్రయం వరకు నడిపేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికైతే 20 బస్సులను ఆర్టీసీ సిద్ధంగా ఉంచింది. శ్రీకాకుళం జిల్లా వాసులు త్వరగా విమానాశ్రయానికి వచ్చే విధంగా రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ఈ విమానాశ్రయంలో మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది రాకపోకలు సాగిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దశలవారీగా సంఖ్యను నాలుగు కోట్ల వరకు పెంచుతామని అధికారులు అంటున్నారు.

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ ను భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నిర్మించారు. రన్వే.. టాక్సీ వే.. ఏప్రాన్ వంటి ప్రాంతాలను అనుసంధానిస్తూ టవర్ నిర్మించారు. ఎయిర్ ట్రాఫిక్ ను నిరంతరం పర్యవేక్షిస్తారు.. ట్రాఫిక్‌ను పర్యవేక్షించే వ్యవస్థ సెకండరీ సర్వేలెన్స్ రాడార్.. ఆటోమేటిక్ డిపెండెంట్ సర్వే లైన్స్ బ్రాడ్ కాస్ట్ ఆధారంగా పనిచేస్తూ ఉంటుంది. ఇందులో అత్యధిక ఏటీసీ ఆటోమేషన్ సిస్టం ఉంది. ప్రస్తుతం ఇందులో క్యాట్ 1 ల్యాండింగ్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని క్యాట్ 2, 3 కి అప్ గ్రేడ్ చేస్తారు.

## రాత్రి పూట ఇవి తింటే
# నిద్ర భంగం

ఈ మధ్యకాలంలో రాత్రి వేళ ఆకలేస్తే చాలా మంది ఇన్‌స్టంట్ నూడుల్స్‌ను సులభమైన ఆహారంగా ఎంచుకుంటున్నారు. కొన్ని నిమిషాల్లో తయారవడం, రుచిగా ఉండటం వల్ల ఇవి యువత నుంచి ఉద్యోగుల వరకు అందరికీ ఇష్టమైన ఎంపికగా మారాయి. అయితే రాత్రిపూట తరచూ నూడుల్స్ తినడం ఆరోగ్యంపై ప్రతి కూల ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇవి తింటే ఏం జరుగుతుందంటే?



ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో సోడియం (ఉప్పు) మోతాదు ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో ఇలాంటి ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే బీపీ సమస్య ఉన్నవారిలో ఇది మరింత ప్రమాదకరంగా మారవచ్చు. దీర్ఘకాలం ఇలా కొనసాగితే గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యల ముప్పు పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. నూడుల్స్‌లో ఎక్కువగా శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి త్వరగా జీర్ణమై రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతాయి. ముఖ్యంగా రాత్రి వేళ శరీర చలనం తక్కువగా ఉండటంతో ఈ అదనపు శక్తి కొవ్వుగా నిల్వ అయ్యే ప్రమాదం ఉంటుంది. దీంతో బరువు పెరగడం, మధుమేహం వచ్చే అవకాశాలు కూడా పెరుగుతాయి.

రాత్రి పడుకునే ముందు భారమైన లేదా అధిక కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకుంటే జీర్ణక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీనివల్ల కడుపులో అసౌకర్యం, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఫలితంగా ప్రశాంతమైన నిద్రకు భంగం కలిగి, మరుసటి రోజు అలసటగా అనిపించే అవకాశం ఉంటుంది. ఇన్‌స్టంట్ నూడుల్స్ ఆకలిని తాత్కాలికంగా తీర్చగలవు కానీ శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ వంటి పోషకాలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల ఇవి కడుపు నింపినా శరీరానికి సరైన పోషణ అందించలేవు. తరచూ వీటిపై ఆధారపడితే పోషకాహార లోపాలు తలెత్తే ప్రమాదం ఉంది.

రాత్రిపూట ఆకలి వేస్తే నూడుల్స్‌కు బదులుగా మఖానా (ఫాక్స్ నట్స్), బాదం, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ తీసుకోవచ్చు. అలాగే గోరువెచ్చని పాలలో కొద్దిగా పసుపు కలిపి తాగడం కూడా మంచి ఎంపిక. ఇవి ఆకలిని తగ్గించడమే కాకుండా శరీరానికి అవసరమైన పోషకాలను అందించి నిద్రను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

అప్పుడప్పుడు నూడుల్స్ తినడం పెద్ద సమస్య కాకపోయినా, వాటిని రోజువారీ రాత్రి ఆహారంగా మార్చుకోవడం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను ఎంచుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం, రక్తపోటు నియంత్రణ, మంచి నిద్ర, మొత్తం శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు చెబుతున్నారు.

## నిలిచిన పాపికొండల పర్యాటకం

**ముద్ర, ఖమ్మం :** గోదావరిలో నీటిమట్టం జోరుగా పెరగడంతో పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జలవనరులశాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. దీంతో పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి వెళ్లే 15 ప్రైవేట్ బోట్లు, 1 ఏపీటీడీసీ బోటు సహా మొత్తం 16 బోట్లు గోదావరి ఒడ్డున నిలిపివేశారు. ఎగువ గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి వరద నీరు రావడంతో బోటు నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. ఈదురుగాలులు, వర్షాలకు పర్యాటక బోట్లు వెళ్లకుండా తాళ్లతో కట్టి ఒడ్డుకు చేర్చారు.



## 1947 విభజన గాథకు
# నిశ్శబ్ద సాక్షి

1947, ఆగస్టు 15న భారత దేశానికి బ్రిటిష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం వచ్చింది. అంతకన్నా ముందే.. అఖండ భారతదేశం రెండుగా విడిపోయింది. ముస్లింలంతా పాకిస్తాన్‌గా విడిపోయారు. అయితే బ్రిటిష్ పాలనలో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో రావి నది ఎడమ ఒడ్డున ఉన్న డేరా బాబా నానక్ రైల్వే స్టేషన్ 1947 నాటి దేశ విభజన వేదనను ఇప్పటికీ మౌన సాక్షిగా నిలిచింది. ఇక్కడికి వచ్చినవారు ఈ స్టేషన్‌ను చూసి ఆశ్చర్యపోతారు. రైలు పట్టాలు సరిహద్దుకు కొన్ని వందల మీటర్ల ముందే అకస్మాత్తుగా ఆగిపోతాయి.

### 1927లో మొదలైన చరిత్ర

బ్రిటిష్ కాలంలో 1927లో నిర్మించిన ఈ స్టేషన్ అప్పటి అవిభక్త పంజాబ్ రైల్వే నెట్‌వర్క్‌లో ముఖ్యమైన భాగం. అమృత్‌సర్ నుంచి సియాల్‌కోట్ వైపు వెళ్లే మార్గంలో ఇది కీలక స్టాప్‌గా ఉండేది. రైళ్లు ఇక్కడి నుంచి నరోవాల్ (సుమారు 37 కిలోమీటర్ల దూరం), కర్తార్‌పూర్ సాహిబ్, సియాల్‌కోట్, లాహోర్ వంటి ప్రాంతాలకు నడిచేవి. రావి నది వంతెన దాటి ప్రయాణాలు సాగేవి. ప్రయాణికులు, వ్యాపారులు, సైనిక సరఫరాలు అన్నీ ఈ మార్గం ద్వారానే జరిగేవి. స్టేషన్ చుట్టూ ఉన్న నివాస క్వార్టర్స్, వెయిటింగ్ రూమ్‌లు బ్రిటిష్ శైలి నిర్మాణాలతో కళకళలాడేవి.

### విభజనతో తెగిపోయిన అనుబంధం

1947 సెప్టెంబర్ చివర్లో ఇక్కడి నుంచి పాకిస్తాన్‌వైపు వెళ్లిన చివరి రైలు ఆగిన తర్వాత ఇక ఆ దిశగా ప్రయాణాలు జరగలేదు. కొత్త సరిహద్దులు ఏర్పడటంతో నారోగేజ్ ట్రాక్‌ను శాశ్వతంగా నిలిపివేశారు. స్టేషన్ టెర్మినస్‌గా మారిపోయింది. ఒకప్పుడు రెండు ప్రాంతాల ప్రజలను, బంధుత్వాలను, వాణిజ్య సంబంధాలను కలిపిన మార్గం ఒక్కసారిగా తెగిపోయింది. ఇప్పుడు ఆ పట్టాలు పొదలు, చెట్ల మధ్య నిశ్శబ్దంగా మిగిలిపోయాయి. విభజన కాలంలో శరణార్థుల రైళ్లు కూడా ఈ మార్గం ద్వారానే తిరిగినట్లు స్థానికులు చెబుతారు.

### కర్తార్‌పూర్ కారిడార్‌తో కొత్త ఆకర్షణ

ఈ ప్రాంతం గురునానక్ దేవ్‌జీ జన్మస్థలానికి సమీపంలో ఉండటంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగి ఉంది. 2019లో కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభమైన తర్వాత భక్తులు, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. చరిత్రపై ఆసక్తి ఉన్నవారు ఇక్కడికి వచ్చి సరిహద్దు ముందే ముగిసిపోయిన పట్టాలను చూసి విభజన కాలం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు. ఒకప్పుడు రైలు మార్గం ద్వారా కలిసిన ప్రదేశాలు ఇప్పుడు కారిడార్ ద్వారా భక్తులను కలుపుతున్నాయి.

### వారసత్వ పరిరక్షణ సవాలే..

ఇటీవల కాలంలో స్టేషన్‌లోని పాత నివాస క్వార్టర్స్‌ను ఆధునీకరణ పేరుతో కూల్చివేస్తున్నారు. స్థానికులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని వారసత్వ సంపదగా పేర్కొంటున్నారు. కర్తార్‌పూర్ కారిడార్ వచ్చిన తర్వాత ఈ స్టేషన్‌ను హెరిటేజ్ గుర్తింపు ఇస్తారని ఆశించారు. కానీ, అది జరగలేదు. బ్రిటిష్ కాలం నాటి నిర్మాణాలు క్రమంగా కనుమరుగవుతుండటంతో చరిత్ర ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. కాలం మారినా ఈ చివరి రైలు పట్టా మాత్రం మారలేదు. అది రెండు దేశాల మధ్య తెగిపోయిన అనుబంధాలకు, ఆగిపోయిన ప్రయాణాలకు, వేలాది కుటుంబాల వియోగానికి నిశ్శబ్ద సాక్షిగా నిలుస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in | @mudranews



**తెల్ల జుట్టు :**
సమతుల ఆహారం జుట్టుకు మేలు చేస్తుందిప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.ఇది కొత్తగా వచ్చే జుట్టు నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.



# ప్రజా పాలన అంటే అభివృద్ధికి చిరునామా

**మంత్రి శ్రీధర్ బాబు**
**ఉప్పల్ నియోజకవర్గంలో రూ.76.46 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**ముద్ర, కాప్రా:** ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో భారీగా అప్పులు చేశారని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు అప్పులను తీర్చుకుంటూనే మరోవైపు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతోందని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల పరిధిలో రూ.76.46 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్‌తో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్క రించారు.ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో వర్షపు నీటి కాలువలు, ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, మల్టీ స్పోర్ట్స్ అరేనా నిర్మాణంతో పాటు భజరంగ్ వ్యాయామశాల విస్తరణ, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ఉప్పల్ ఎక్స్‌రోడ్ బస్‌స్టాప్‌ను వి.టి. కమాన్ వద్ద ఉన్న ఉప్పల్ బస్‌స్టాండ్‌కు తరలించేందుకు అదనపు డ్రైవ్‌వేలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను ప్రారంభించారు.బీర ప్పగడ్డ డివిజన్‌లో రాఘవేంద్ర కాలనీ వద్ద రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణంతో పాటు గౌడ్స్, విశ్వకర్మ శ్మశానవాటికల అభివృద్ధి, జహీద్ నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు.కుషాయిగూడ డివిజన్‌లో జమ్మిగడ్డ, ద్వారకాపురి ప్రాంతాల్లో పాత ఆర్ఆర్ కల్వర్టుల స్థానంలో ఆర్‌సీసీ రోడ్ క్రాసింగ్ కల్వర్టుల నిర్మాణం, బలోపేతం, విస్తరణ పనులతో పాటు వాసవి శివనగర్‌లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.చర్లపల్లి డివిజన్‌లో సిల్వర్ ఓక్ బంగ్లాల ప్రాంతం, ఈసీ నగర్, రైల్ విహార్ కాలనీ, చర్లపల్లి చెరువు పరిసరాల్లో తృతీయ వర్షపు నీటి కాలువలు, ఆర్‌సీసీ పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వంపుగూడ డివిజన్‌లో వంపుగూడ నాలా నుంచి వంపుగూడ గ్రామం, సాకేత్ మిథిలా వరకు వర్షపు నీటి కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించారు.ఈ అభివృద్ధి పనుల ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వలు, వరద సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ, క్రీడా సదుపాయాలు, ప్రజా మౌలిక వసతులు మెరుగుపడతాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్నం రుక్కమ్మకు నివాళి




**ముద్ర, కూకట్‌పల్లి :** శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మరియు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి పట్నం రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ గురువారం షాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా రుక్కమ్మ చిత్రప టానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పట్నం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదిం చాలని ఆయన ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పుష్పా రెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, మస్తాన్ రెడ్డి, శ్రీనివాస్ బాబు, రంగమోహన్, నారాయణ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## బాలయ్య కుటుంబాన్ని పరామర్శించిన పీఏసీ చైర్మన్ గాంధీ

**ముద్ర, హైదరాబాద్:** హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలి నగర్ రైల్వే అండర్‌పాస్ వద్ద మ్యాన్‌హోల్‌లో ప్రమాదవశాత్తు గల్లంతైన బాలయ్య (70) కుటుంబ సభ్యులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరామర్శించి ధైర్యం చెప్పారు. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్, సేవా ఇస్లావత్‌తో కలిసి బాధిత కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, బాలయ్య గల్లంతైన ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని పోలీసులు, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, జలమండలి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అర్ధరాత్రి వరకు నాలా అవుట్‌లెట్‌లు, చెరువు ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను స్వయంగా పరిశీలించామని, కెమెరాల సాయంతో ప్రతి మ్యాన్‌హోల్‌ను తనిఖీ చేస్తూ బాలయ్య ఆచూకీ కోసం అహర్నిశలు గాలింపు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. అలాగే అధికారులు కూడా పనులు జరుగుతున్న ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆరెకపూడి గాంధీ అన్నారు.

# కరెంట్ షాక్ మృతుల పరిహారం రూ.8 లక్షలకు పెంపు

**ఏప్రిల్ 1నుంచి అమలు.. విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా**




**ముద్ర, హైదరాబాద్:** విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించేలా తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ శాఖ ఉద్యోగులు కాని వ్యక్తులు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన సందర్భాల్లో అందించే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.కొత్త విధానం ప్రకారం, మృతుల కుటుంబాలకు మొత్తం రూ.8 లక్షల పరిహారం అందించ నున్నారు. ఇందులో రూ.7.20 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో, మరో రూ.80 వేలును నగదు రూపంలో చెల్లిస్తారు. బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు టీజీఎస్‌పీడీ సీఎల్ తెలిపింది.అదేవిధంగా విద్యుత్ ప్రమాదాల్లో పశువులు మృతి చెందిన సందర్భాల్లోనూ పరిహారాన్ని కొనసాగించ నున్నారు. ఆవు, గేదె, దున్నపోతు మృతి చెందితే రూ.40 వేల పరిహారం, గొర్రె లేదా మేక మృతి చెందితే రూ.7 వేల ఆర్థిక సాయం అందజేయనున్నారు.విద్యుత్ ప్రమాదాల బాధితులకు మెరుగైన సహాయం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. అలాగే విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
**సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో సుమారు 3,500 దరఖాస్తులు స్వీకరణ**
**భూ రీ-సర్వేతో ఏడాదిన్నరలో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
**అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు**
**కల్లూరులో నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మంత్రి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రజల సమస్యలను ప్రభుత్వం నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కల్లూరు డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సత్తుపల్లి క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మొత్తం సుమారు 3,500 దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటిలో 1,800 ఇందిరమ్మ ఇళ్లకు, 500 వరకు రెవెన్యూ సమస్యలకు, 200 పెన్షన్లకు, ఇతర మిగతా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. ఇదే విధంగా పాలేరు నియోజ కవర్గ ప్రజా దర్బార్‌లో 25 వేల దరఖాస్తులు అందగా, వాటిలో 13 వేల దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధిం చినవేనని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గం సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసు కుంటోందన్నారు. ఒకేసారి అందరికీ ఇళ్లు మంజూరు చేస్తే ఆర్థిక భారం పెరుగు తుందని, అందుకే దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడుతున్నా మని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.5 లక్షల కోట్ల అప్పు భారం మోపిన ప్పటికీ పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి రాజీ ఉండదన్నారు.సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 సంవత్సరాలుగా ఉన్న రెవెన్యూ సమస్యలను భూ రీ-సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. మరో ఏడాది న్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వే పూర్తి చేసి శాశ్వత పరిష్కారం అందిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు విచారణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పేదల భూములు ఎలా కాజేయబడ్డాయో, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు అన్నీ ప్రజలకు వెల్లడవు తాయని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. గత యాసంగి లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని, ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయనివిమ ర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమ రేషన్ ఫారాన్ని బీఎల్‌వోలకు ఆగస్టు 3లోపు తప్పనిసరిగా అందజేసి ఓటు హక్కును పరిరక్షించు కోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి,అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ, కల్లూరు మునిసిపాలిటీ చైర్మన్ మోహన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద మరణం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**ముద్ర, దేవరకొండ:** నల్గొండ జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో జరిగిన రోడ్డు ప్రమాద మరణం కేసులో నిందితుడికి దేవరకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడాది సాధారణ కారాగార శిక్ష విధించింది.గుర్రపు తండాకు చెందిన ఇస్లావత్ బూరా (35) టాటా ఏస్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణ మైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.వి.ఎస్. హరీష్ బాబు, ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి నిందితుడి నేరం రుజువైందని నిర్ధారించారు.దీంతో నిందితుడికి 12 నెలల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 10 రోజుల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.ఈ కేసులో ప్రభుత్వ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. సంతోష్ కుమార్ వాదనలు వినిపించగా, అప్పటి దర్యాప్తు అధికారి కె. శంకర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు చేసి బలమైన చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు, డీసీఆర్‌బీ లైజన్ సిబ్బంది సమన్వయంతో కేసు సత్వర విచారణ పూర్తయింది.ఈ సందర్భంగా నల్గొండ జిల్లా పోలీసులు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రాణనష్టం జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చెంగేశ్‌పూర్ గ్రామంలోఉచిత వైద్య శిబిరం



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ప్రజలకు సామాజిక సేవ చేయడంలో బీసీ సంక్షేమ సంఘం ఎనలేని కృషి చేస్తుందని సంఘ సభ్యులు పేర్కొన్నారు. గురువారం రోజునన్యూ లోటస్ హాస్పిటల్, తాండూర్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచిత మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు, రక్త నమూనాల సేకరణ కూడా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజల ఆరోగ్యమే గ్రామ అభివృద్ధికి పునాది" అన్నారు.గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్ బీసీ సంఘం ప్రతినిధులకు, న్యూ లోటస్ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డ్ సభ్యులు, న్యూ లోటస్ హాస్పిటల్ అధినేత మాణిక్యం, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకూర్, మీడియా ఇన్‌చార్జ్ బసవరాజ్, బీసీ సంఘం నాయకులు రాము ముదిరాజ్, పరమేష్, పాండు గౌడ్, దుబాయ్ వెంకట్, తాండ్ర నరేష్, మంబాపూర్ మంజుల, వినయ్, కిరణ్, ఆసుపత్రి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ఎంపీ ఈటల రాజేందర్



**ముద్ర, మల్కాజిగిరి:** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి అదనపు నిధులు కేటాయిం చాలని, కౌకూరు దర్గా నుంచి బిట్స్ పిలానీ వరకు డిఫెన్స్ భూములలో రహదారి నిర్మాణం, విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరారు.అదేవిధంగా డిఫెన్స్ ప్రాంతంలోని పలు రహదారుల విస్తరణతో పాటు సామాన్య ప్రజలకు రాకపోకల అనుమతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాజకీయ పరిస్థితులు, రాజ్‌నాథ్ సింగ్ తాజా తెలంగాణ పర్యటనపై కూడా ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు.తెలంగాణలో బీజేపీ మరింత పట్టు సాధించేందుకు అనుకూల అవకాశాలు ఉన్నాయని, కేంద్ర నాయకత్వం సహకారం, రాష్ట్ర నాయకుల సమన్వయంతో రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవే స్తామని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.

## లోక్‌సభలో బాధ్యతారహితంగా రాహుల్ ప్రసంగం

**మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్**



**ముద్ర, కాప్రా:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం సభా గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. గురువారం రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ పల్నాటి వెంకట్ రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ వైఖరి వల్ల యువత, విద్యార్థులు తీవ్రంగా నష్ట పోయారని ఆరోపించిన ప్రభాకర్, రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీ పౌరసత్వ వివాదం, విదేశీ పర్యటనలకు సంబంధించిన అంశాలపై దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థుల జీవితాలతో చెలగాటమా డుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం**



**ముద్ర ప్రతినిధి, తాండూర్: తతత** భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బిజెపి లడాయి అనే కార్యక్రమాన్ని తాండూర్ పట్టణంలోని శాలివాహన డిగ్రీ కాలేజ్ మరియు భాష్యం జూనియర్ కాలేజ్ లో జిల్లా యువ మోర్చా అధ్యక్షులు చిట్యాల సాయికిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఫీజు రియంబర్స్ మెంట్ స్కాలర్ సదుపాయంతోనే చదువుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రియంబర్స్ మెంట్ మరియు స్కాలర్ షిప్ ఇవ్వకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు అగామ్య గోచరంగా మారి ఉన్నత విద్యను చదవలేక పోతున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే 15 వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి విద్యా సంవత్సరం నిర్నిత గడువులోగా చెల్లింపులు జరిగేలా చూడాలని అలాగే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు ఫ్లోర్ లీడర్ 28వ వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23వ వార్డ్ కౌన్సిలర్ అంతారం కిరణ్, బీజేవైఎం టౌన్ ప్రెసిడెంట్ తాండ్ర నరేష్ బిజెపి, బీజేవైఎం నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, మనోహర్ రెడ్డి శోభన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి హియరింగ్ ఎయిడ్ అందజేత



**ముద్ర, కూకట్‌పల్లి:** వెంకటేశ్వర నగర్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు విరమ్మ వినికిడి సమస్యతో బాధపడుతుండగా, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పందించి ఆమెకు హియరింగ్ ఎయిడ్ అందజేశారు. వైద్య పరీక్షలు చేయించి వినికిడి పరికరం ఏర్పాటు చేయించారు. దీంతో భావోద్వేగానికి గురైన విరమ్మ తనకు అండగా నిలిచిన రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు ఆయన సేవాభావాన్ని అభినందించారు.

## పేకాట స్థావరంపై దాడి.. ఇద్దరు మహిళలతో సహా ఏడుగురు అరెస్టు

**ముద్ర, కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లోధా మెరిడియన్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు మహిళలతో సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,42,080 నగదు, 40 పేకాట కార్డుల సెట్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in | @mudranews



**తెల్ల జుట్టు : డైలు, సీరమ్‌లు తాత్కాలిక పరిష్కారమే**

హెయిర్ డైలు లేదా కలర్ డిపాజిట్ చేసే సీరమ్‌లు తెల్లజుట్టును తాత్కాలికంగా మాత్రమే కప్పిపు చ్చుతాయి.అవి సహజంగా మెలనిన్‌ను తిరిగి ఉత్పత్తి చేసి జుట్టును శాశ్వతంగా నల్లగా మార్చవు.



# పేద ప్రజల గుండె చప్పుడు.. లైఫ్‌లైన్ ఆర్టీసీ..

- కరీంనగర్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు శ్రీకారం..
- మొదటి దశలో మూడు రూట్లలో సేవలు
- త్వరలో చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ, మానకొండూరు వరకు విస్తరణ
- పేదల సంక్షేమం.. ప్రయాణికుల సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం..
-సిటీ బస్సులను విద్యార్థులు మహిళలు ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలి..
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





**ముద్ర, కరీంనగర్ :** "ఆర్టీసీ పేద ప్రజల గుండె చప్పుడు.. లైఫ్‌లైన్. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ నగర ప్రజలకు ఆధునిక, సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఘనంగా ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మమేకమయ్యారు. మొదటి దశలో కరీంనగర్–వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్–చింతకుంట, కరీంనగర్–కొత్తపల్లి హవేలీ రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చామని తెలిపారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉపాధి కోసం చింతకుంట, ఒద్యారం, కొత్తపల్లి ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు వచ్చే కార్మికులు, ఉద్యోగులు, అలాగే వాగేశ్వరి, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ, మానకొండూరు వరకు కూడా సిటీ బస్సు సేవలను విస్తరిస్తామని ప్రకటించారు.

ప్రయాణికుల ఆదరణను బట్టి అవసరమైతే ఒకే రూట్‌లో అదనపు బస్సులు నడపడంతో పాటు, 24 గంటల సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు దశలవారీగా సిటీ బస్సు సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. కొత్త బస్సుల కొనుగోలు, కొత్త నియామకాలు, కారుణ్య నియామకాలు, కార్మికుల పెండింగ్ బకాయిల చెల్లింపు, ఉద్యోగుల సంక్షేమం వంటి చర్యలతో సంస్థను బలోపేతం చేశామని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని, ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు అంకితభావంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నారని కొనియాడారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కరీంనగర్ నగర ప్రజలు సిటీ బస్సులను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు స్పందించి సిటీ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణతోనే ఆర్టీసీ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ సంస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ప్రజలకు చేరువయ్యే రవాణా సేవలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల వరకు సిటీ బస్సులు ఏర్పాటు చేయడం హర్షణీయమని, తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ, పి, ఏఎమ్ & లీగల్) కె. రాజశేఖర్ రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) పి. మల్లేశం, కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి బావ్ రావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, డిపో మేనే జర్లు ఐ. విజయమాధురి (కరీంనగర్–1), ఎం. శ్రీనివాస్ (కరీంనగర్–2), ఎ. ప్రకాశ్‌రావు (సిరిసిల్ల), బి. శ్రీనివాస్ (వేములవాడ), ఎన్. రమేశ్ (జగిత్యాల), డి. హరి (మెట్‌పల్లి)తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ముద్ర, కోరుట్ల :** భారీ వర్షాల కారణంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్–ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును గురువారం రోజు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ పరిశీలనలో తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ తిరుమల వసంత అధ్యక్షతన గురువారం రోజు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో పొందుపరచిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో పట్టణములోని అన్ని వార్డులలో మురికి కాలువలు శుభ్రం చేయుటకు తగు చర్యలు తీసుకోవల్సిందిగా మరియు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వార్డు సభ్యులు కోరారు. అనంతరం చైర్ పర్సన్, సభ్యులందరూ ప్రస్తుత వర్షాకాల దృష్ట్యా అన్ని వార్డులలో మురికి కాలువలు శుభ్రం చేయలని మరియు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ సిబ్బందినీ ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్ పర్సన్, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు మరియు మున్సిపల్ కమిషనర్ గారు , డిప్యూటీ ఈఈ, మేనేజర్, టౌన్ ప్లానింగ్ అధికారి, జెఏఓ, ఆర్ఓ, ఎస్ ఐ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యవసర అయితేనే బయటకు రావాలి



**ముద్ర, కోరుట్ల;** గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన 10, 11 వార్డులు మరియు ముత్యాలవాడ, ఆదర్శ నగర్ ప్రాంతాలను గురువారం రోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, డా. అనూప్ రావు, పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఆరోగ్యశాఖ విద్యుత్ శాఖ, మరియు ఆర్ & బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రావొద్దని, వరద నీరు ప్రవహిస్తున్న రోడ్లు, వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు నీటితో నిండిన ప్రాంతాలకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి సుధవేణి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గందె నవీన్, తదితరులు వారి వెంట ఉన్నారు.

## భారీ వర్షాల కారణంగా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్...**

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో కోరుట్ల–రాయికల్ ప్రధాన రహదారిపై ఉన్న వాగు బ్రిడ్జిపై ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహానికి అడ్డంకిగా పేరుకుపోయిన చెత్తను గురువారం రోజు పరిశీలించారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా వాగులు, బ్రిడ్జిల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, కోరుట్ల ఎంపీడీవో వోదెల రామకృష్ణ, కల్లూరు గ్రామ సర్పంచ్ చిట్నెనీ లత–రమేష్, సర్వరాజ్ పల్లె సర్పంచ్ నత్తి రాజ్ కుమార్, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో ఘనంగా ఎన్.సీ.సీ రిపబ్లిక్ డే పరేడ్ డే క్యాంప్

**పాల్గొన్న ఎన్.సీ.సీ అధికారులు**
**చక్కగా సమన్వయపరిచిన పాఠశాల**



**ముద్ర, కరీంనగర్:** ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ (రిపబ్లిక్ డే) పరేడ్‌లో పాల్గొనే ఎన్సీసీ క్యాడెట్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా కరీంనగర్‌లో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు, ఎన్సీసీ అధికారులు క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్సీసీలో చేరిన ప్రతి విద్యార్థి కేవలం సర్టిఫికెట్ కోసమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి, సేవాస్ఫూర్తి వంటి విలువలను అలవర్చుకుంటారని తెలిపారు. రాజ్‌పథ్ (ప్రస్తుతం కర్తవ్య పథ్)పై అడుగులు వేయడం ప్రతి ఎన్సీసీ క్యాడెట్ జీవితంలో అత్యున్నత గౌరవమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఎన్సీసీ క్యాడెట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కొద్దిమందికే ఈ అవకాశం లభిస్తుందని తెలిపారు. క్రమశిక్షణ, పరేడ్ నైపుణ్యం, శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వం వంటి అంశాల్లో ప్రతిభను నిరూపించిన వారినే ఎంపిక చేస్తారని వివరించారు.

రాష్ట్ర, గ్రూప్, డైరెక్టరేట్ స్థాయిల్లో జరిగే కఠినమైన ఎంపిక శిబిరాలను విజయవంతంగా పూర్తి చేసిన క్యాడెట్లే ఢిల్లీకి ఎంపిక అవుతారని తెలిపారు. విద్యార్థులు ఎన్సీసీ అధికారులు సూచించిన విధివిధానాలను కచ్చితంగా పాటించి అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణమూర్తి గారు, సంగారెడ్డి, హావిల్దార్ దేవేంద్ర సింగ్, అదిలాబాద్, సుబేదార్ జంగ్ బాజ్ ఖాన్, సునీల్ కుమార్, సుబేదార్ నిజామాబాద్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనుల జాప్యంపై బండి సంజయ్ అసంతృప్తి

అర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లపై అసహనం - భూసేకరణలో జాప్యంవల్లే పనుల ఆలస్యమైందని అధికారుల వివరణ
- బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వలేదని వెల్లడి
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మేయర్ ను కోరిన కేంద్ర మంత్రి
- హుటాహుటిన తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్దకు వెళ్లిన మేయర్, కమిషనర్
- యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టాలని మేయర్ కొలగాని నిర్ణయం



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పాటు స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో ఓ వృద్ధురాలు పడిపోయిన ఘటనపై సమాచారం అందడంతో సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రహదారులు, భద్రతా చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్ స్పందిస్తూ ఆర్వోబీ నిర్మాణంలో ఆలస్యానికి ప్రధాన కారణం భూసేకరణలో జరిగిన జాప్యమేనని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ప్రస్తుతం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తోందని తెలిపారు. అలాగే ప్రజల రాకపోకలకు అనుకూలంగా బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు కూడా నిలిచిపోయాయని వెల్లడించారు.

ఈ విషయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఢిల్లీ నుంచి కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హుటాహుటిన ఆర్వోబీ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మరోవైపు సేతు బంధన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆర్వోబీ నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు అందిస్తున్నప్పటికీ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని మంత్రి బండి సంజయ్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన కాంట్రాక్టర్ భూసేకరణ పూర్తయిన వెంటనే పనులను వేగవంతం చేసి రాబోయే ఆరు నెలల్లో ఒకవైపు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, వచ్చే ఏడాదిలోపు మొత్తం ఆర్వోబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

## వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి

**ఎస్పీ జానకి షర్మిల**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. నిర్మల్ జిల్లాలో మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి , ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కడెం మండల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో కూలిన పాత ఇల్లు

**పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి....**



**ముద్ర, కోరుట్ల;** మెట్‌పల్లి ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెట్‌పల్లి పట్టణంలోని 15వ వార్డులో చావిడి వద్ద శిథిలావస్థలో ఉన్న ఒక పాత ఇంటి గోడలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వెంటనే స్థలాన్ని సందర్శించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి విఘాతం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు మరియు సిబ్బందితో కలిసి కూలిపోయిన శిథిలాలను జేసీబీ సాయంతో తక్షణమే తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడూతూ "భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా పాత కాలపు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసముంటున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితి లో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలి. శిథిలావస్థలో ఉన్న భవనాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ గౌడ్, వార్డు కౌన్సిలర్ మాసుల ప్రవీణ్, కో ఆప్షన్ పన్నాల మాధవ్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరుకు ఎత్తిపోతలు

**ముద్ర న్యూస్ ధర్మారం:** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీపాద ఎల్లంపల్లి జలాశయానికి వరద పోటెత్తడంతో నీటిపారుదల శాఖ ఎత్తిపోతలు మొదలెట్టింది. బుధవారం నాలుగు మోటర్లతో ఎత్తిపోతలు చేపట్టిన అధికారులు గురువారం మరో మోటారును ఆన్ చేశారు. నంది పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్‌లలో ఐదు మోటార్ల చొప్పున నడిపిస్తూ 15,750 క్యూసెక్కుల నీటిని రాజరాజేశ్వర(మధ్యమానేరు) జలాశయానికి తరలిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in | @mudranews



తెల్ల జుట్టు :

చర్మ వైద్యుడి సలహా తీసుకోవడం ఉత్తమం
హఠాత్తుగా ఎక్కువగా తెల్లజుట్టు వస్తే డెర్మటాలజిస్టును సంప్రదించడం మంచిది.స్వయంగా ఉత్పత్తులు వాడటానికి బదులుగా నిపుణుల సలహాతో సరైన చికిత్స ఎంచుకోవడం సురక్షితం.

# స్వర్ణగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

## శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ

శ్రవణ నక్షత్రంను పురస్కరించుకొని గురువారం స్వర్ణగిరి క్షేత్రంలో ఉదయం భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా కొండ కింద ఉన్న శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం గోవింద నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచి నీరు మజ్జిగ అందించి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామివారికి తిరుప్పావడ సేవ చేశారు. స్వామి వారి జన్మ నక్షత్రం అయినా శ్రావణ నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామివారి రథోత్సవ సేవ ఆదిమధ్యాంతరహితుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో రథం పై శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారికి రథోత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



# కాంగ్రెస్ అహంకార గద్దె కూలడం ఖాయం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నగరంలోని 8వ డివిజన్‌లో బీఆర్ఎస్ జెండా దిమ్మె కూల్చివేతను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. జెండా దిమ్మెను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు రాజకీయ కక్షతో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అనుసరిస్తూ బీఆర్ఎస్ జెండా గద్దెలను కూల్చివేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని



విమర్శించారు. జెండా దిమ్మెలను కూల్చితే బీఆర్ఎస్ బలహీనపడదని, పువ్వాడ అజయ్ కుమార్‌పై ప్రజలకు ఉన్న అభిమానం, పార్టీపై విశ్వాసం ఖమ్మం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి ప్రతిపక్షంపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఈ చర్యలను ఎదుర్కొంటామని, ప్రజల తీర్పే కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి సమాధానం చెబుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తుల మురళి, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దేవభక్తుని కిశోర్ బాబు, గొల్లపూడి రాంప్రసాద్, సురేశ్ నాయక్, వీరేందర్ గౌడ్, షకీనా, మాటేటి కిరణ్, ఉస్మాన్, వేగినాటి మధు తదితరులు పాల్గొన్నారు.

# అవకతవకలపై విచారణ జరపాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** ఇటీవల నిర్వహించిన ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని వాటిపై విచారణ జరిపి న్యాయం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జిల్లా కలెక్టర్ దివకర టిఎస్ ను కోరారు. బాధిత అభ్యర్థులతో కలిసి ఆయన కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు . ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామకాలలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం ప్రక్రియ పై విచారణ జరిపి, అర్హులైన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని వెంకటవీరయ్య కోరారు.కలెక్టర్ ను కలిసిన అనంతరం బాధితులతో మాట్లాడుతూ అవసరమైతే హైకోర్టు ను ఆశ్రయిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు.

# పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వీడాలి

## మాజీ మంత్రి పువ్వాడ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** వర్షాకాలం నేపథ్యంలో ఖమ్మం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. నగరంలో పలుచోట్ల చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు పూడుకుపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీని క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని పేర్కొన్న పువ్వాడ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పనిచేయాలని, పారిశుద్ధ్యంపై ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# యాదగిరిగుట్ట సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదగిరిగుట్ట సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, పరిపాలనా విధానాలు, నేరాల నమోదు, దర్యాప్తు పురోగతి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీ సందర్భంగా యాదగిరిగుట్ట సర్కిల్ పరిధిలోని తుర్కపల్లి, రాజాపేట, మోటకొండూరు, గుండాల పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల పనితీరు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, బీట్ వ్యవస్థ, విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ, కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ ప్రజలకు నమ్మకమైన సేవా కేంద్రంగా ఉండాలని, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో




పాటు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి జోన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ యాదగిరిగుట్ట సర్కిల్ పరిధిలోని తుర్కపల్లి, రాజాపేట, మోటకొండూరు, గుండాల పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ అధికారులు, సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలు సంక్షేమ సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా జరుగుతున్న సంక్షేమ సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో బాల్య వివాహాలు, తీవ్ర లోప పోషణ ఉన్నా పిల్లలు, రక్తహీనతతో ఉన్న గర్భిణీ స్త్రీలు, దత్తత, బాల కార్మికులు, అనాథ పిల్లల సంరక్షణ, పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల వారీగా లబ్ధిదారుల వివరాలు, తీవ్రమైన పోషకాహార లోపం, మోస్తరు పోషకాహార లోపం ఉన్న చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ పిల్లల పోషకాహార స్థితిని సక్రమంగా అంచనా వేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని, పిల్లల బరువులను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.మండలాల



వారీగా గుర్తించిన పిల్లలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి వైద్యాధికారుల ద్వారా చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సూపర్‌వైజర్ తమ పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీల పూర్తి సమాచారాన్ని కలిగి ఉండి, వారికి అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.జిల్లాలో బాల్య వివాహాల నివారణలో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు, మండల బాలల పరిరక్షణ కమిటీలు చురుకుగా పనిచేసేలా ఫీల్డ్ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో శాఖల వారీగా ఏర్పాటు చేసిన అన్ని కమిటీల సమావేశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు అసంపూర్తిగా ఉన్న సఖి కేంద్రాలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్,సీడీపీఓలు శైలజ, వెంకటరమణ, స్వరాజ్యం, నాజీ, అనంతలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, ఐసీపీఎస్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకులకు సీఐ అభినందన



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పాత శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గల ఎస్పిఆర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో గురువారం విద్యార్థి నాయకుల బాధ్యతల స్వీకారోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2026–27 విద్యా సంవత్సరానికి ఎన్నికైన విద్యార్థి నాయకులకు బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్ కి విద్యార్థులు సెల్యూట్‌లతో ఘన స్వాగతం పలికారు. బ్యాండ్ మేళంతో సగౌరవంగా ఆయనను సభా ప్రాంగణానికి తీసుకువచ్చారు. అనంతరం నూతన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు ప్రధానం చేసి బాధ్యతలను అధికారికంగా అప్పగించి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత నాయకత్వం ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సమాజంలో మంచి గుర్తింపును సంపాదించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. నాయకత్వం అంటే ఇతరులకు సేవ చేయడం క్రమశిక్షణ నిజాయితీతో ఉండి చదువులో రాణించాలన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మీరే మీ పాఠశాలకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణే విజయానికి మొదటి మెట్టు అని నాయకులుగా ఎన్నికైన మీరు ఎస్పిఆర్ పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నన్నూరి రామ్‌రెడ్డి నూతన నాయకులను అభినందించి వారికి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాల్వాయి సునీతా రెడ్డి విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంపొందించే విధంగా సేవలందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులో గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని వైఎస్ఆర్ వద్ద రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న భవనాలు పరిశీలించారు . నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# "ఫీజుల బకాయి – బిజెపి లడాయి" సంతకాల సేకరణ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని నిరసిస్తూ, భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర పిలుపు మేరకు భువనగిరి పట్టణంలోని జాగృతి, ఎస్.ఎల్.ఎన్.ఎస్. డిగ్రీ కళాశాలలో "ఫీజుల బకాయి – బిజెపి లడాయి" కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి ఫ్లోర్ లీడర్, భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్ వంగేటి సుచరిత, 19వ వార్డు కౌన్సిలర్ బండారి స్వర్ణలత హాజరయ్యారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శదయాల కుమారస్వామి మార్గదర్శకత్వంలో బీజేవైఎం భువనగిరి పట్టణ అధ్యక్షులు మామిడోజు పవన్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యాన్ని కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు, పెండింగ్ సర్టిఫికెట్లు, పరీక్షలకు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. సుమారు 1,500 మంది విద్యార్థులు సంతకాలు చేసి తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ రెడ్డి, పాక మహేష్, మర్రి శివ, రావుల సంతోష్, మధు, సాయి, దిలీప్, కుమార్, ఉదయ్ తదితర బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 31.07.2026
www.mudranews.in | @mudranews



**తెల్ల జుట్టు :**
తెల్లజుట్టుకు కారణాన్ని గుర్తించడం ముఖ్యంవంశ పారంపర్యం, ఒత్తిడి, విటమిన్ B12, ఐరన్, కాపర్ లోపాలు కూడా చిన్న వయసులో తెల్లజుట్టుకు కారణమవుతాయి.ముందుగా కారణాన్ని గుర్తించి దానికి తగ్గ చికిత్స తీసుకోవడం మంచిది.



# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సన్నద్ధం

**పతకాల లక్ష్యంతో రాష్ట్ర క్రీడా సంఘాలతో స్పోర్ట్స్ అథారిటీ వ్యూహాత్మక సమావేశాలు**

**ముద్ర, హైదరాబాద్:** ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (కేఐవైజీ) నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా సన్నాహాలు ప్రారంభించింది. స్వరాష్ట్రంలో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల్లో తెలంగాణ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అత్యధిక పతకాలు సాధించాలనే లక్ష్యంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్ఏటీజీ) రాష్ట్ర క్రీడా సంఘాలతో వ్యూహాత్మక సమావేశాల శ్రేణికి శ్రీకారం చుట్టింది.స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ. సోనిబాలా దేవి అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో అథ్లెటిక్స్, సైక్లింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, బ్యాడ్మింటన్, మల్లఖంబ్, గట్కా, కలరిపయట్టు తదితర రాష్ట్ర క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణకు పతకాల అవకాశాలు ఉన్న క్రీడల్లో ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి, వారికి శాస్త్రీయ పద్ధతుల్లో ప్రత్యేక శిక్షణ అందించే అంశంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా క్రీడాకారుల ఎంపికను మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ముందుగా రాష్ట్రవ్యాప్తంగా సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నారు. అనంతరం వారికి ఫస్ట్ లెవల్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించి ప్రతిభను




మరింత మెరుగుపరుస్తారు. చివరగా అత్యుత్తమ క్రీడాకారులతో కోర్ క్యాంప్ ఏర్పాటు చేసి జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.ప్రతి దశకు సంబంధించిన శిక్షణా కాలవ్యవధి, కోచ్‌ల నియామకం, క్రీడా సామగ్రి, పోషకాహారం, వైద్య సహాయం, ఫిట్‌నెస్, ఆధునిక శిక్షణా విధానాలు, అవసరమైన మౌలిక వసతులపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా డా. ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ క్రీడాకారులు స్వరాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా అన్ని విధాలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఎక్కువ పతకాల అవకాశాలున్న క్రీడలను గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణా శిబిరాలు, నిపుణులైన కోచ్‌లు, అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు.ఈ ప్రక్రియలో భాగంగా మిగిలిన రాష్ట్ర క్రీడా సంఘాలతో కూడా దశలవారీగా సమావేశాలు నిర్వహించి సన్నాహాలను మరింత వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు.సమావేశంలో ఎస్ఏటీజీ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, శ్రీనివాస్, అశోక్, పీఆర్ఓ సురేష్ కాలేరు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రతినిధి ప్రవీణ్‌తో పాటు వివిధ రాష్ట్ర క్రీడా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సిద్దిపేట అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మరో మైలురాయి

**50వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ తో ఫ్యాక్టరీ మరో ముందడుగు**
**-సిద్దిపేట ఫ్యాక్టరీ అయిల్ శాతం టర్న్ ఓవర్ ఎక్కువ గా ఉంది.**
**-ఎక్కువ శాతం అయిల్ టర్న్ ఓవర్ ఉండటం రైతు లకు ఎంతో మేలు.**
**-రోజుకు 600 టన్నులు, నెలకు 18వేల టన్నుల క్రషింగ్ చేసే పూర్తి స్థాయి సామర్థ్యం కలిగివున్నా ఫ్యాక్టరీ గా రికార్డ్**
**-సిద్దిపేట అయిల్ ఫామ్ సాగు విస్తరణ పై క్యాంప్ కార్యాలయం లో అదికారులతో సమీక్ష నిర్వహించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ చాలా అద్భుతంగా పని చేస్తుందని, అనతి కాలం లోనే మంచి ఫలితాలు ఇస్తుందని, గొప్ప మైలు రాయి తెచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో అయిల్ ఫెడ్, అగ్రికల్చర్ అధికారులతో సిద్దిపేటజిల్లా, సిద్దిపేట నియోజకవర్గ అయిల్ ఫామ్ సాగు విస్తరణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సిద్దిపేట నియోజకవర్గం లోని నంగునూర్ మండలం లో నిర్మించుకున్న అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ 50వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ చేసి మరో మైలు రాయి ని తెచ్చిందని చెప్పారు.. అనతి కాలం లోనే 50వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ చేసుకొని ముందుగు సాగుతోందని ఒక ప్రజాప్రతినిధిగా నాకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.. అదేవిదంగా సిద్దిపేట ఫ్యాక్టరీ అయిల్ శాతం టర్న్ ఓవర్ ఎక్కువ గా ఉందని ఎక్కువ శాతం అయిల్ టర్న్ ఓవర్ ఉండటం రైతు లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.. ఎంత ఖర్చు అవుతే తిరిగి అంతే ఆదాయం రైతు కి వస్తుందని చెప్పారు.. రోజుకు 600 టన్నులు, నెలకు 18వేల టన్నుల క్రషింగ్ చేసే పూర్తి స్థాయి సామర్థ్యం కలిగివున్నా ఫ్యాక్టరీ గా రికార్డ్ అని అన్నారు. పిప్పి తీసి విద్యుత్ ఉత్పత్తి చేసుకొనే విధంగా చేసుకున్నామని, భవిష్యత్ ని ద్రుష్టి లో పెట్టుకొని నాడు కెసిఆర్ ఆశీస్సులతో రిఫనరి ఏర్పాటు చేసుకున్నామన అయిల్ ఫామ్ గెలలు లోపలికి వెళితే బాటిల్ తో నూనె వంటిట్లోకి వస్తుందని చెప్పారు. అలాంటి ఆదునాతన విధానం తో ఫ్యాక్టరీ నిర్మాణం చేసుకున్నామని చెప్పారు.. పంటల కొనుగోలు విషయం లో కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఏ పంట అయిన 25%మాత్రమే కొంటుందన్నారు.కాళేశ్వరం నీళ్లు, చెక్ డ్యామ్ లలో నీళ్లతో తేమ శాతం పెరిగి సిద్దిపేట ప్రాంతం అయిల్ ఫామ్ సాగు కు అనువైందన్నారు. ధర కూడా 24వేలు చేరిందని మొదట్లో నమ్మకం లేకుండే ఇప్పుడు నెల నెల డబ్బులు రావడం తో అయిల్ ఫామ్ వేయాలి అనే ఆసక్తి కలిగిందని చెప్పారు.రైతు కు కావాల్సిన ఎరువులు, డ్రిప్, మొక్కలు అందుబాటులో ఉంచాలని, జిల్లాలో చందలా పూర్, ఎల్లాయి గూడ, ములుగు వద్ద నర్సరీ లు ఉన్నాయని, అవసరమగు మొక్కలు రైతులకు అందించాలని కోరారు. సిద్దిపేట జిల్లాలో అయిల్ ఫామ్ సాగు విస్తరణ పెంచాలని, సాగు లక్ష్యం కొరకు కృషి చేయాలనీ, అయిల్ ఫామ్, అగ్రికల్చర్ అధికారుల సమన్వయం తో రైతు లకు మేలు చేయాలి. రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి అవగాహన కల్పించాలి. అయిల్ ఫామ్ సాగు లో సిద్దిపేట జిల్లా, సిద్దిపేట నియోజకవర్గం ఎప్పుడు ఫస్ట్ ఉండాలని, సాగు పెంచడం లో అందరూ కలసి కట్టుగా పని చేయాలని, నాయకులు,ప్రజాప్రతినిధులు రైతు లకు అయిల్ ఫామ్ సాగు పై నిత్యం రైతు ల్లో అవగాహన కలిపించాలని, అందుబాటులో ఉండాలని చెప్పారు..

# వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టరేట్లో కంట్రోల్ రూం ఏర్పాటు**
**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారులందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. మండలాలవారిగా అధిక వర్షాలపై స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావాలన్నారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలని, అత్యవసరం ఉంటే తప్ప అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు.కలెక్టరేట్లో 9391942254 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకూడదనీ,అత్యవసర పరిస్థితులలో ప్రజలను రక్షించేందుకు రోప్స్, డ్రోన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు.చెరువులు, కల్వర్టులు, కుంటలలో నీరు ప్రవాహం రీచ్ అయ్యే అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డులు పెట్టి చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ హాస్టల్స్ అంగన్వాడి సెంటర్స్, రూఫ్ లీకేజీ ఉన్నట్లయితే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సిఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.## ఉద్యోగ అవకాశాలు....మెదక్ జిల్లాలోని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ వివిధ విభాగాల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. హోటల్, ఫుడ్, హాస్పిటాలిటీ, మార్కెటింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీ, హెచ్ఆర్, అకౌంట్స్ తదితర రంగాల్లో అనుభవం కలిగిన వారికి ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9372478535 సంప్రదించాలన్నారు.

# వృద్ధుడి మృతదేహం కోసం గాలింపు





**ముద్ర, శేరిలింగంపల్లి :** మియాపూర్ వైశాలి నగర్ దగ్గర కాలువలో పడిపోయిన వ్యక్తి డెడ్ బాడీని కెమెరాస్ పంపించి నీటిలో చెత్తను తొలగించి కెమెరాను పంపించి డెడ్ బాడీ వెతుకుతున్నటువంటి దృశ్యాలు. మృతుడి డెడ్ బాడీ వెతికెందుకు అధికారులు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గత మూడు రోజులుగా స్వయంగా అధికారులను సమన్వయ పరుస్తూ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

## బీజేపీ మండల నూతన కమిటీ



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల భారతీయ జనతా పార్టీ నూతన కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించిన మండల అధ్యక్షుడు భూతరాజు భరత్ కుమార్ బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులుగా ఇస్లావత్ రమేష్ నాయక్, బొడ్డుపల్లి ఆంజనేయులు, మెండే లింగస్వామి, కొర్ర వశ్యా నాయక్, మండల ప్రధాన కార్యదర్శిగా బొడ్డు యాదయ్య, కోశాధికారిగా నున్నప్రోలు మహేష్, కార్యదర్శులుగా కుక్కమూడి రాములు, రమావత్ విజయ్, కర్ణాటి పార్వతమ్మ, బొడ్డుపల్లి యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా జెంగిటి రమణ, కొండమీది మల్లేష్,రమావత్ సురేష్, ఏడ్పుల జనార్దన్,కొర్ర రాజు నాయక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు భూతరాజు భరత్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశ హితం కోసం పనిచేస్తుందని తెలిపారు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందాయని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీ







**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ప్రకటించారు.బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మల్లన్నగారి బిక్షపతి,ఉపాధ్యక్షులుగా బడెకోల్ నర్సింహులు,కంకణాల నర్సింహులు,కొండి శంకర్,ప్రధాన కార్యదర్శులుగా మామిండ్ల నాగులు,బొడ్డు నర్సింహులు, కార్యదర్శులుగా దేవుని ఉపేందర్,నిమ్మల శ్రీనివాస్,సందొబోయిన కుమారస్వామి,కార్యవర్గ సభ్యులుగా చెన్నగోని వెంకటేష్ గౌడ్,పున్న రమేష్,రంగనబోయిన కుమార్,పులిగారి స్వామి,కొయాల్కర్ హరి శంకర్,గవ్వల రమేష్,కాంటలపల్లి వేణుగోపాల్,బట్టు తిరుపతి,కోరే సంతోష్ కుమార్,అప్పల మల్లేష్,మండె సంపత్,సగ్గు కృష్ణ యాదవ్ నియామకమైనట్లు అధ్యక్షుడు ప్రకటించారు

## వైభవంగా వజ్ర పురస్కారాల ప్రదానం

**ఘనంగా గురు పూజోత్సవం**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వ్యాస మహర్షి యోగా సెంటర్లో వజ్ర పురస్కారాల ప్రధానోత్సవం వైభవంగా జరిగింది. వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన గురు పూజోత్సవంలో సొసైటీ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ తాము వెలుగుతూ ఇతరులను వెలిగిస్తూ సాగిపోయే గురువుల పాత్ర ముఖ్యమైనదని చెప్పారు. మారుతున్న కాలంలో పెరుగుతున్న కాలుష్యాలను ఎదుర్కోవడానికి, రేపటి తరాన్ని రక్షించుకోవడానికి గురువుల అవసరం అనివార్యమన్నారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ ప్రతి సంవత్సరం గురుపూజోత్సవాలను నిర్వహిస్తూ గురువులను స్మరిస్తుందని పేర్కొన్నారు. గురు సంకల్పాలను నెరవేర్చడమే గురువులకు ఇచ్చే గొప్ప దక్షిణ అని పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి వివిధ రంగాల్లో అద్భుత సేవలు అందిస్తున్న వ్యక్తులకు వజ్ర పురస్కారాలను అందిస్తున్నట్లు చెప్పారు. గురువుల స్ఫూర్తిని అందరిలో నింపడం తమ సంకల్పం అన్నారు. గత పది సంవత్సరాల నుంచి చేస్తున్న కృషి వల్ల నేడు సిద్దిపేట యోగా రంగంలో జాతీయ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ కుల,మత ,లింగ, వయో బేదం లేకుండా మంచి దారిని చూపించే వారందరూ గురువులేనని పేర్కొన్నారు. సంక్షోభాల నుంచి గురువు చేతి వేలు పట్టుకొని రక్షిస్తాడని తెలిపారు. ఆరోగ్యం, మానవ విలువలు, సనాతన సాంప్రదాయాలను రక్షించుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రముఖ గురువు తోట సతీష్ మాట్లాడుతూ ఆరోగ్య సిద్దిపేట, ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారతదేశం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. భారతదేశ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచిగా మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల టీచర్లు సుభద్ర (జక్కాపూర్), స్వామి (పుల్లూరు) , అద్భుత గో సేవ చేస్తున్న మధుసూదన్, సామాజిక సేవలు అందిస్తున్న వీరేశం, భగవద్గీత శ్లోకాలు ఉచితంగా నేర్పిస్తున్న టీచర్ విజయలక్ష్మి , సాంస్కృతిక రంగంలో కృషి చేస్తున్న నరసింహ చారి, బాల సాహిత్యంలో అద్భుత కృషి నిర్వహిస్తున్నారు కవి, రచయిత ఉండ్రాళ్ళ రాజేశం, పత్యగద్య సాహిత్యంలో కృషి చేస్తున్న టీచర్ గుమ్మన్న గారి బాల సరస్వతి లకు వజ్ర పురస్కారాలను ప్రధానం చేసి సత్కరించారు. ఉత్సవంలో యోగా టీచర్లు సభ్యులు అయిత అంజయ్య, తోట సంధ్య, గంగాపురం శ్రీనివాస్, బస్వ రాజ్ కుమార్,సురేష్, సాయి, వేణు, వాసవి, నరేష్, కిషన్ , ఆనంద్, చందన,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తాం

**జిల్లా కలెక్టర్ హైమావతి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** దోస్త్ ఆన్లైన్ ద్వారా గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ ప్రాంతాల నుండి అడ్మిషన్ పొందిన విద్యార్థి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని జిల్లా. కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.గురువారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ హబ్, సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం సఖి కేంద్రం వెనకాల వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లలో హాస్టల్ సౌకర్యం గూర్చి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దోస్త్ -(Degree Online Services-Telangana) ద్వారా రాష్ట్రం నలుమూల నుండి సిద్దిపేట, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందారని చదువుకోడానికి కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయి కానీ నిరుపేద విద్యార్థులు కావున ప్రవేట్ రూమ్ తీసుకుని చదువే స్తోమత లేఖ అడ్మిషన్ తీసుకోక కళాశాల నుండి మార్చుకోకుండా వివిధ ప్రాంతాల నుండి అడ్మిషన్ పొంది ప్రభుత్వం తరపున హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని ఏ ఒక్క విద్యార్థి కళాశాల నుండి వెళ్లకుండా విద్యార్థి, విద్యార్థులకు వేరువేరుగా హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ హబ్ లో ఎడ్యుకేషన్ హబ్ లో వెనకాల కాలిగా ఉన్న భవనాలు సైతం హాస్టల్ కొరకు సిద్ధం చెయ్యాలని, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ లో కొన్ని గదులను కేటాయించి అందులో విద్యార్థులు ఉండడకోసం బెడ్స్, వాష్ రూమ్, కిచెన్ అన్ని నిర్మించాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ను కేటాయించం జరుగుతుందని ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే పూర్తి చెయ్యాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం సఖి కేంద్రాన్ని కాలేక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిత, ఈడబ్ల్యూఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డి డబ్ల్యూ ఓ శారద, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555